# సింహప్రసాద్

# మరో కన్నీటి కథ



బస్టాండులో అప్పుడే ఆగిన బస్సులోంచి బయటికి చూసింది పార్వతి.

ఆ వూరు విడిచెళ్ళి మూడు నెలలే అయినా వూరెంతగానో మారిపోయినట్టు కొత్తగా అన్పించిందామెకి.

చూపుల్తో బస్టాండంతా వెదికింది. ఎక్కడా భర్త జాడ లేదు.

నిట్టూర్చబోయింది గాని దాసికన్నా ముందే కన్నీళ్ళొచ్చేశాయ్.

బస్సు ఖాళీ అవటంతో సామాను క్రిందికి దింపి "దిగక్కా" అన్నాడామె తమ్ముడు రాంబాబు. కళ్లు తుడుచుకుని నెలరోజుల వయస్సు కూడా లేని పసిబిడ్డని పదిలంగా పట్టుకుని బస్సు దిగింది.

రాంబాబు రిక్షా మాట్లాడి సొరె బిందెల్నీ ఇతర సామానునీ రిక్షాలో పెట్టించాడు. ఇద్దరూ ఎక్కగానే రిక్షా కదిలింది.

ఆమెకి చాలా భయంగా ఆందోళనగా వుంది. తన ఇంటిని సమీపిస్తున్న కొద్దీ అవి పెరిగి ఆమెలో టెన్షన్‌ని పెంచుతున్నాయ్.

తనకి నెల తప్పినప్పుడు భర్త ఆనందరావు చేసిన ఆర్భాటం గుర్తొచ్చింది.

తనని రెండు చేతుల్తో ఎత్తి గిరగిరా త్రిప్పేశాడు. తననెంతో పొగిడేశాడు. ఏవో తీపి పదార్థాలు తెచ్చి బలవంతాన తినిపించాడు.

ఆఖర్న చావు కబురు చల్లగా చెప్పినట్టు చెప్పేడు.

"అన్నయ్యకి మగపిల్లల్లేరు, పుట్టిన ముగ్గురూ ఆడపిల్లలే. చెల్లెలికి నలుగురు ఆడపిల్లల్తర్వాత ఒక మగ నలుసు పుట్టాడు. నువ్వు మాత్రం తొలిసారే మగ పిల్లాడ్ని కనాలి."

చిన్నగా నవ్వి "నాకూ కొడుకునే కనాలనుంది కాని అది నాచేతిలో వుందా చెప్పండి" అంది చనువుగా.

అతడి మొఖం గంభీరంగా మారింది. "అదేమో నాకు తెలీదు. నువ్వేం పూజలూ పుణ్యాలూ చేస్తావో తెలీదు. నువ్వు మగబిడ్డని కని తీరాల్సిందే" ఖండితంగా చెప్పేడు.

నవ్వబోయిందల్లా అతడి మొఖం చూసి ఆగిపోయింది. అతడి మూర్ఖపు పట్టుదల గురించీ మగాడన్న అహంకారం గురించీ ఆమెకి బాగా తెలుసు. అందుకే గుండెలు భయంతో అరుస్తోన్నా మౌనంగా వుండిపోయింది.

అంతలో తమ దగ్గరే వుంటోన్న అత్తగారూ అదే పాటందుకుంది.

"నువ్వు మా వంశాన్ని నిలబెట్టేందుకు మగ నలుసుని కనాల్సిందే కోడలా" అందావిడ.

"ఇది మొదటి కాన్పే కదండి. పుట్టక పోతారా" అన్నీ తెలిసిన మీరు కూడా వరుసగా అయిదారుగురు ఆడపిల్లలకి జన్మనిచ్చి నామెతో చెప్పినట్టంటారేవిటీ అన్నట్టు చూసింది పార్వతి.

కాని ఆవిడ అదేమీ పట్టించుకోలేదు.

"మా పెద్దాడికి అలాగే అనుకున్నాం. ఏవయ్యిందీ? ముగ్గురూ ఆడ మలయాళమే ఏవి ఏమైనా సరే మొదటి సంతానమే మగ సంతానం కావాలి. తర్వాతి సంగతెవరు చూడొచ్చారు గనుక. మాకు నీకన్నా మా వంశం నిలిపే వంశాంకురం ముఖ్యం" అందావిడ.

హతాశురాలయ్యింది పార్వతి.

"మా అమ్మ చెప్పింది అక్షరాల నిజం. ఎలాగైనా సరే నువ్వు అబ్బాయికి జన్మనివ్వాల్సిందే" అని కూర్చున్నాడు ఆనందరావు.

గుడ్లలో నీళ్ళు కుక్కుకు నుండిపోయిందామె మౌనంగా.

రోజూ ఇద్దరూ అ విషయం గురించే ఎడా పెడా వాయించడం మొదలుపెట్టారు. నెలలు నిండుతోన్నకొద్దీ ఆమెలో ఆందోళన అధికమై ఆరోగ్యం దిగజారసాగింది. ఎవరైనా సరదాకి నీకు ఆడపిల్ల పుడుతుందని చెబితే చాలు మళ్ళీ పడుతోంది.

ఎన్ని ఘోర కలలు కన్నదో ఎన్నిసార్లు నిద్రలో పులిక్కిపడి లేచిందో మరెన్ని నిద్ర లేని రాత్రులు గడిపిందో ఆమెకొక్కదానికే తెలుసు!

పార్వతి పురుటికి పుట్టింటికెళ్తోంటే వాళ్ళు గట్టిగా నొక్కి చెప్పేరా సంగతినే.

"ఆఖరి సారి చెబుతున్నా పార్వతీ. నువ్వు మగపిల్లాడ్ని కనకపోతే మళ్ళీ నీ ముఖం చూడను గుర్తుంచుకో" అన్నాడానందరావు నిష్కర్షగా, నిర్దాక్షిణ్యంగా.

"వంశోద్ధారకుడ్ని కంటేనే నీకు మళ్ళీ ఈ ఇంట్లో స్థానం వుంటుంది. లేకపోతే నువ్వు మళ్ళీ రానక్కర్లేదు. మా అబ్బాయికి మళ్ళీ పెళ్ళి చేస్తాను. ముందే చెప్పేం గదా మాకు మా వంశం నిలవడం ముఖ్యం అనీ" అంది అత్తగారు.

అదిరి పడింది. ప్రాధేయ పూర్వకంగా చూసింది.

వాళ్ళు కరగ లేదు.

కన్నీటితో మెట్టినింటి గడపదాటింది.

"తొలిచూలన్న సంతోషమే లేదేమిటే" అని పుట్టింట్లో అంతా అంటే తనని కాసక్టూరు కుంది తప్పతన భయాల్ని బయటపెట్టలేదు. "మొగుడి మీద బెంగకాబోలు" అని నవ్వినా ఆమె వులకలేదు పలకలేదు సిగ్గుపడనూ లేదు. "కాన్పు భయం కాబోల్లే" అని సరిపెట్టుకున్నారంతా.

ఆమె ఎంతగానో ఎదురుచూసిన క్షణాలు రానే వచ్చాయి.

ఆసుపత్రిలో బిడ్డ కేర్‌మని ఏడవడం ఆలస్యం క్రమ్ముతోన్న మగతని ప్రక్కకు నెట్టి "మగబిడ్డేనా?" అనడిగింది ఆత్రంగా.

"కాదు ఆడపిల్ల. ఎర్రగా బావుంది"

నర్సు మాటలు వినిపించలేదు. చెవులు దిబ్బళ్ళేసినట్టు పిచ్చిగా చూసింది. అనంతరం వువ్వెత్తున లేచిన కడలి తరంగం బండని తాకగా గుండెలు ప్రక్కలైనట్లు హోరున ఏడ్చేసింది పార్వతి.

మరి రెండ్రోజుల వరకూ ఏడుస్తూనే వుందామె పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టకుండా.

అంతా ఓదార్చేరు. కసిరేరు. ఆడపిల్ల ఆదిలక్ష్మి అని పొగిడారు. ఈ సారి మగబిడ్డని కంటావంటూ ఆశపెట్టారు. అలా ఏడిస్తే నీ ఆరోగ్యం పాడవుతుందని హెచ్చరించారు.

కానామెకి ఓదార్పులభించలేదు. కన్నీరాగలేదు. గుండెకోత ఆగలేదు.

పార్వతి తండ్రి పనిపట్టుకుని అల్లుడి దగ్గరి కెళ్ళి ఆదిలక్ష్మి పుట్టిందనీ తల్లీ బిడ్డా క్షేమమనీ చెప్పేరు.

అల్లుడు ముఖం త్రిప్పేసుకున్నాడు. వియ్యపురాలు "మీది ఆడపిల్లల్ని కనే వంశమనుకోలేదు" అంటూ రుసరుసలాడింది.

"ఇప్పుడేవయ్యిందమ్మా. తొలికాన్పేకదా వాళ్ళకేం వయసైపోలేదు కదా."

"అలాటి కబుర్లు చాలా విన్నాం. చాలా చూశాంగానీ మీరు తెచ్చిన వార్తకి అబ్బాయి మనస్సు విరిగిపోయింది. కోడల్ని మీఇంట్లోనే ఉంచుకోండి" అంది నిర్మొహమాటంగా.

అవాక్కైపోయారాయన. అతికష్టంమీద "అదేవిటమ్మా" అనగలిగారు.

జవాబుగా తలుపులు ముఖాన్నే వేసేసిందావిడ.

భారమైన హృదయంతో వెనుదిరిగారు.

అక్కడ జరిగిన సంగతులు ఇంట్లోవెంటనే చెప్పకపోయినా మెల్లమెల్లగా పార్వతితోసహా అందరికీ తెలిసిపోయాయి. ఎక్కువ రోజులుంచుకోవడం మంచిదికాదని నెలలోనే పార్వతిని సారెచీరల్తో సాగనంపారు. అన్నీ అవే సర్దుకుంటాయని ధైర్యం నూరిపోసి మరి పంపారు.

కానీ ధైర్యం అప్పుడే జారిపోయింది!

మాటి మాటికీ కళ్ళు తుడుచుకుంటున్న అక్కనిచూసి "అంత ఇదైపోతావెందుకక్కా. ఇదంతా నువ్వు కావాలని చేసినట్టు ఫీలవుతావెందుకూ?" అన్నాడు రాంబాబు.

ఆమె మౌనం వహించింది నీ కర్థంకాదులే అన్నట్టు.

రిక్షా ఆగింది. ఆ శబ్దానికి తలుపు తీసుకొచ్చిన పార్వతి అత్తగారు ఆమెనిచూసి తిరిగి తలుపేసేసుకుంది.

రిక్షాలోంచి దిగబోయిన పార్వతి అదిచూసి ఆగిపోయింది.

"ఫర్లేదు దిగక్కా."

భయం భయంగా చూస్తూ సన్నగా కంపిస్తూ దిగింది.

తలుపు తట్టాడు రాంబాబు. అయిష్టంగా తలుపుతీసిందావిడ.

"శుభమా అంటూ మీ కోడలూ మనవరాలూ ఇంటికొస్తే తలుపేసేసుకున్నారేవిటి అత్తయ్యా" అంటూ సారెబిందెలూ అవీ ఇంట్లో పెట్టాడు.

ఆవిడ పార్వతి వంక గాని పొత్తిళ్ళలోని బిడ్డవంకగాని చూళ్ళేదు. ముఖం త్రిప్పేసుకుని లోపలికెళ్ళిపోయింది.

"మేనర్లెస్ బ్రూట్స్" గొణుక్కున్నాడు రాంబాబు.

మరి కాస్సేపటికి ఆఫీసునుంచొచ్చాడు ఆనందరావు.

ఆశగా చూసింది పార్వతి.

కానతడామెని చూస్తూనే మండిపడ్డాడు. "రావొద్దని చెప్పేంగా. ఏమొఖంపెట్టుకునొచ్చావ్? వెళ్ళు వెళ్ళు."

"తనింటికి తనొస్తే వెళ్ళిపొమ్మంటారేవిటి బావగారూ."

రాంబాబు మాటలకి రోషంగా చూశాడతడు.

"రానక్కర్లేదని ముందే చెప్పేను."

"అక్క చేసిన నేరమేమిటి?"

'ఆడపిల్లని కనటం'

"అందులో ఆమె బాధ్యత ఎంత?"

"పూర్తిగానూ"

"మీకు తెలుసో లేదో ఏ విత్తనం నాటితే ఆ మొక్క పుడుతుంది. నిమ్మవిత్తనం నాటి మామిడిచెట్టు రాలేదంటే ఎలా చెప్పండి?"

## యాక్సిడెంట్

ప్రేమారావు చేతి కట్టును జూసి రామారావు -

"ఏమైందండీ ప్రేమారావు గారూ?" అడిగాడు.

"చిన్న యాక్సిడెంట్"

"అరె! ఎలా జరిగింది?"

"ముందు నా నోరు జారింది లెండి" అన్నాడు బాధగా ప్రేమారావు.

-యస్.వి. రఘుబమూర్తి

"నీ వుపమానాలు నాకనవసరం. నా వంశం నిలపలేనప్పుడామె గొడ్రాలితో సమానం. ఆమె మాకక్కర్లేదు"

"మీలాంటి మూర్ఖులవంశం నిలవకపోవడమేమంచిది"

"షటప్"

"నాకు చాలా తిట్టడ మొచ్చు బావగారూ. వాటికి పనికల్పించకండి చదువుకుంటే చాలదు. సంస్కారం ఇంకితజ్ఞానం కూడా వుండాలి. మీ రక్తానికి తన రక్తమాంసాలతో బాటు ప్రాణాన్నించి పాపని కని మరో జన్మ ఎత్తిన ఆ మాతృమూర్తి మనస్సునర్థం చేసుకోడానికి ప్రయత్నించండి. మగవాడిగా కాదు మనిషిగా ఆలోచించడం నేర్చుకోండి. అక్కని ఆదరించక పెర్రి మొర్రి వేషాలేశారో మేం సహించం గుర్తుంచుకోండి" అని బావగార్తో చెప్పి, "నువ్వేం అధైర్యపడకక్కా అన్నీ సర్దుకుంటాయిలే. అర్థంచేసుకోక పశువులా ప్రవర్తిస్తే మాత్రం మాకు కబురుపంపు వాళ్ళ అంతు చూస్తాను" అని అక్కని ఓదార్చి శలవు తీసుకువెళ్ళిపోయాడు రాంబాబు.

చీకటి పడింది.

అయినా పార్వతి వచ్చినప్పుడు. కూర్చున్న ముందుగదిలోనే శిల్పంలానే వుండిపోయింది

పలకరించేవారు లేరు. అన్నపానాలు చూసే వాళ్లేరు.

పసిపిల్ల గుక్కపెట్టి ఏడుస్తోంది తల్లిపాలు చాలక.

అసహాయురాలై పసిగుడ్డు మీద విసుక్కుంది. ఏడ్చింది.

పిల్లగొంతు హెచ్చింది.

"పుట్టగానే ఆ రాక్షసిపిల్ల గొంతునులిమి చంపక నన్నుమల్ని చంపుతావేమిటే, పెద్దల్ని పంపి విడాకులు తీసుకుంటాను" మగమహారాజన్నాడు విసుగ్గా, కోపంగా.

"ఏమండీ" కన్నీటితో ప్రార్థించింది.

"నీకూ నాకూ ఎలాటి సంబంధమూలేదని ఇదివరకే కబురంపాను. పూరికే ఏడ్చి రాద్ధాంతం చెయ్యకుండా మీ ఇంటికి పో. మళ్ళీ నీ రౌడీ తమ్ముడ్ని పంపించావో నేను మంచివాడ్ని కాదు జాగ్రత్త"

"లక్ష్మి నడిచొచ్చే వేళ నట్టింట ఈ బుడిబుడి దీర్ఘాలేవిటే. ఆడపిల్లని కంటే నువ్వు మళ్ళీ ఈ గడప తొక్కనక్కరేదని ఇది వరకే చిలక్కి చెప్పినట్టు చెప్పేంగదా. మళ్ళీ ఇప్పుడే ఏడ్పులేవిటి మా పరువు బజార్న పడెయ్యాలని? సరిసరే గాని నలుగురూ చూడకుండా వచ్చినదారే వెళ్ళు"

పార్వతి ఎంతో ప్రాధేయపడింది. ఏడ్చింది కాళ్ళుపట్టుకుని మొత్తుకుంది.

కాని వాళ్ళు విన్లేదు.

ఇక మగ సంతు కలగదనీ తమతోనే తమ వంశం అంతమవుతుందనీ భయం ఓప్రక్క!

ఈ వంకన విడాకులిచ్చేసి మళ్ళీ పెళ్ళిచేస్తే బోలుడు కట్నం వస్తుందన్న ఆశ మరో ప్రక్కన! ఫలితంగా వారి గుండెలు రాతిలా గట్టిపడ్డాయ్. ఎన్ని తుఫాన్లూ, గాలివానలూ వచ్చినా అవి కరగవు. మానవత్వంతో ఆలోచించవు. స్వార్థం, స్వలాభాపేక్ష, స్వసుఖం ముఖ్యం!

ఆమెని ముందు గడిలోవే వదిలేసి లోపలి తలుపులు మూసేసుకున్నారు కట్టుకున్నవాడూ అతగాడ్ని కన్నతల్లీనూ.

ఏడ్చి ఏడ్చి అలసిపోయింది పార్వతి.

పిల్ల ఎప్పుడో సొమ్మసిల్లిపోయింది.

చీకటి.

చలి.

ఒంటరితనం.

కనుచూపు మేరలో కనిపించని ఆశ.

అర్ధరాత్రయింది.

తలుపులు బాదింది.

విసుక్కుంటూ తిట్టుకుంటూ తలుపులు తీశారు—ఆమె బాధ చూళ్ళేకకాదు. ఇరుగు పొరుగు భయంచేత.

కన్నీళ్ళతో పాదాభిషేకం చేసిందామె.

ఆమె నోరుమూసి వీధిలోకి లాక్కెళ్ళి తలుపులు గడియపెట్టేసుకున్నారు.

కనిపించని దేవుళ్ళందర్నీ వేడుకుంది.

ఎవరూ ఆమె మొరవినలేదు.

ఇరుగూ పొరుగూ తొంగిచూసి జారుకున్నారు.

తననీ కన్నవాళ్ళనీ కడుపున పుట్టినవాన్నీ దేవుళ్ళనీ తిట్టింది.

అలసిపోయింది.

నిరాశాసంద్రంలో నిలువునా కూరుకుపోయింది.

భర్త కాదన్నాక బ్రతకటం అనవసరం అనుకుంది.

తన పేగు త్రెంచుకుని పుట్టిన బిడ్డని నోరు తెరచి అమ్మా అని ఒక్కసారైనా అనని అన్లేని బిడ్డని అక్కున చేర్చుకుని కృష్ణమ్మ తల్లి ఒడిలో తలదాచుకోడానికి నడిచింది పాపం పార్వతి! *

